R. No. M. 3152.

12 పేజీలు అర్థణా

ప్రతిగ్రామం పత్రికల్లో నిండాలె. ప్రతిఒక్కరు చదువు కోవాలె. ఆనాడు—

సంవత్సర చందా రు 3
—
పల్లెల్లో ప్రకటన లందిం చాలంటే ఇదే—

# జయభారత్ రైతు



లోకానికి అన్నంపెట్టేది నేను-

తిండిలేక మలమల మాడి చచ్చేది నేను-

—రైతు.

| సంపుటము 8 | శుక్రవారము 9—7—37 | సంచిక 28 |
|---|---|---|

# వర్కింగుకమిటి పదవీ స్వీకరణమును అంగీకరించుట.

కాంగ్రెసువర్కింగు కమిటీ సమావేశము పదవీ స్వీకారమును గురించి తీర్మానించుటకు వార్ధాలో 5, 6, 7 తేదులలో సమావేశమాయెను. గాంధిగారును సభకు వెళ్లిరి. కాంగ్రెసుకు మెజారిటీ వచ్చిన మద్రాసు, బొంబాయి, సంయుక్త పరగణాలు, మధ్యపరగణాలు, ఒరిస్సా బీహారురాష్ట్రముల అసెంబ్లీ కాంగ్రెసుపార్టీ నాయకులు ఆహ్వానింపబడిరి.

కాంగ్రెసు అధ్యక్షుడు నెహాఱ్రునితో కమిటీ సమావేశమునకు ముందుగ పదవీస్వీకరణమును గురించి గాంధిజీ ప్రకటనలు, రాజప్రతినిధి ప్రకటన, గవర్నరుల ప్రకటనలను, కాంగ్రెసు సంఘముల తీర్మానములు, రాష్ట్రీయ సంఘముల రిపోర్టులు మొదలగువాటిని గురించి గాంధిజీతో విపులముగ చర్చించిరి. మూడురోజులు కమిటీ చర్చ జరిగినమీదట పదవీస్వీకరణమునకు అనుకూలముగ తీర్మానము గావించబడెను.

తుదినిర్ణయము గావించబడువరకును చర్చల విషయము, సభ్యుల అభిప్రాయము ఏవిధముగ నుండెనను విషయములు అతిరహస్యముగ నుంచబడెను. 6 తేదిన ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటలవరకును మధ్య ఒకగంట విరామముతో కమిటి సమావేశము జరిగెను. గాంధిజీ సాయంత్రం 5 గంటలవరకువుండి సేగాం గ్రామము వెళ్లి మరుసటి ఉదయం వచ్చిరి.

6 తేది కమిటి సమావేశము నెహ్రూగారి ఉపన్యాసంతో ఆరంభమైంది. 5 తేది సభలో వివిధసభ్యులు తెల్పిన అభిప్రాయముల క్రోడీకరించి సభ్యులకు తెలియపరచి తర్వాత గాంధిజీని తన అభిప్రాయమును తెలుపుమని కోరిరి. గాంధిజీ మునుపుజరిగిన కాంగ్రెసు కార్యవర్గసమావేశము మొదలు నేటివరకును భారతరాజకీయ విషయములగురించి వ్యక్తపరచిరి. కమిటి చర్చలు అతి రహస్యముగనుంటచే గాంధిజీ ఉపన్యాసము గురించి స్పష్టముగ సంపూర్ణముగ పత్రికావిలేఖరులు తెలుసు కొనజాలకపోయిరి. కాని ఆకమిటి సమావేశమందుండిన కొందరు నాయకులతో సంప్రతించుటవలన పత్రికా విలేఖరులు గాంధి ఉపన్యాసమందు క్రింది విషయములను గ్రహించగల్గిరి.

## దురభిప్రాయములు.

గాంధిజీ "బీధాలు" నుండి, గావించిన ప్రకటన అంతరుపూర్వము రాజ్యాంగ ప్రతిష్టంభనము పైగావించిన ప్రకటనలవలనను కాంగ్రెసుసభ్యులు కొందరు దురభిప్రాయపడిరనియు, ఆదురభిప్రాయములు ప్రకటించిన పిదప, వాటివలననే వారిలో యింతవరకును కాంగ్రెసుపైనున్న అభిమానము తగ్గిపోయినదనియు, గాంధిజీ చెప్పిరట.

## గాంధిజీ అభిప్రాయములు

### రాష్ట్రీయ అసెంబ్లీ కాంగ్రెసు నాయకులు 6 గురిలో 5 గురు అనుకూలాభిప్రాయముల వెలిబుచ్చిరి.

అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశము జరుపుటకు తగినవ్యవధిలేదు.

### ఉద్యోగములు స్వీకరించినను స్వీకరింపకపోయినను కాంగ్రెసు గౌరవమును తగ్గించకూడదు.

ఎలక్షన్ మ్యానిఫెస్టోలో నిర్వచించిన ప్రకారము ఒకవైపున చట్టమును నిరోధించుచును, మరొకవైపు నిర్మాణకార్యక్రమమును కొనసాగించుచును కాంగ్రెసువారు పదవులను స్వీకరింపవలెను.

మెజారిటీగల రాష్ట్రములలో కాంగ్రెసు మంత్రులు ప్రజాబలమును పొందుటకొరకే ఉద్యోగస్వీకరణమును ఉపయోగించుకొనవలెనన్న కాంగ్రెసువాదుల మాటలలో చాలఅర్థముకలదనియు, ఇట్లు ప్రజాబలము పొందిన పిదప, యెప్పటికైన నూతనచట్టము విధ్వంసమగును కావున, అట్లువిధ్వంసమైనపుడు పదవీస్వీకరణమువలన కలిగిన ప్రజాభిమానము, ఉత్సాహమును, ముందుముందు కాంగ్రెసు కార్యక్రమములకు ఎక్కువగ ఉపకరించునటుల చేయవలెనను అభిప్రాయముకూడ మంచిదేనని గాంధిజీ తెల్పిరి.

కాబట్టి వివిధప్రకటనలను గురించి విశదంగా వివరించుచు యున్నియు కాంగ్రెసుయొక్క స్థితిని స్పష్టముగ తెలుపుటకే గావింపబడెననియు, భారతదేశంలోను, ఇంగ్లాండులోను బాధ్యతగల అధికారులుకూడ ఆప్రకటనలను అపార్థము చేసికొని దురభిప్రాయపడిరనియు తెలిపిరి.

## మరొక మార్గము.

రాజకీయ ప్రతిష్టంభనము యేర్పడి కాంగ్రెసు పరిస్థితులలో క్లిష్టత సంభవించినచో కమిటీవారు అవలంబించుటకు మరొక మార్గమును గాంధిజీ తెలియబరచిరి.

## ప్రత్యేకాధి కారములు.

వైస్రాయిప్రకటనలో అఖిలభారత కాంగ్రెసు కమిటి తీర్మానించిన హామీవిషయమై తృప్తికరమగు జవాబు కనుపడలేదనియు గవర్నరుల ప్రత్యేక అధికారములు ఆవిధముగ నేయుండుటవలన కాంగ్రెసువారికిని గవర్నరులకును భేదాభిప్రాయము, సంఘర్షణకలుగుటకు ఎక్కువ అవకాశములు కలవనియు, ఇండియామంత్రి జట్లండుప్రభువు వైస్రాయి లిన్‌లిత్‌గోగారలు తమప్రకటనలందు సుహృద్భావము వున్నటుల యెంతో కనపరచినను, కాంగ్రెసుమంత్రులు కాంగ్రెసుయొక్క ఆదర్శము ననుసరించి చాలకాలము చట్టమును అములుపెట్టజాలరనియు, గాంధిజీ తెలిపినటుల తెలియుచున్నది.

## పదవీ స్వీకారమువలన ప్రజల అభిమానము అధికమగును

కాంగ్రెసువారు పదవులు స్వీకరించినచో ప్రజాసామాన్యమునందు కాంగ్రెసు అభిమానము, ఉద్యమమును పెంపొందించుటకు ఎక్కువ అనుకూలముగనుండుననియు, కాంగ్రెసుమంత్రులకును గవర్నరులకు భేదాభిప్రాయము యేర్పడి నూతన విధానమున విధ్వంసమగును కావున, ముందు ముందు కాంగ్రెసు ప్రజాసామాన్యముతో సంబంధించి వేరైన ఒకగొప్ప కార్యక్రమాన్ని నడపదలచినచో పదవీస్వీకరణమువలన యేర్పడిన సదాభిప్రాయము ఉత్సాహము కాంగ్రెసుకు ఎక్కువ లాభకరముగ నుండగలదనియు, అందువలన కాంగ్రెసువారు పదవులను స్వీకరించవలెనని చెప్పువారి వాదనలందు కొంతబలమున్నదనియు, గాంధిజీఅంగీకరించినారని తెలియుచున్నది.

కాంగ్రెసువారు అధికారమును స్వీకరించినను, స్వీకరించకపోయినను కాంగ్రెసు ప్రతిష్ఠకు ఏవిధమైన భంగము కలుగకుండనుండు పద్ధతినే అనుసరించవలెనని జవహరిలాలుగారు చెప్పిన అభిప్రాయముతో గాంధిజీ యేకీభవించెను.

## రాష్ట్రీయనాయకుల అభిప్రాయము కనుగొనుట.

సాయంత్రం 5 గంటలకు రాష్ట్రీయ అసెంబ్లీ కాంగ్రెసుపార్టీ నాయకులు పిలువబడి వారివ్యక్తిగత అభిప్రాయములు పార్టీ అభిప్రాయములు తెలుపవలయునని కోరబడిరి. కమిటిచర్చలలో ఏమిజరిగినది వారికి తెలుపబడలేదు. ఆరురాష్ట్రముల నాయకులలో అయిదుగురు సి. రాజగోపాలాచారి, పండిత గోవిందవల్లభ పంతు, డాక్టరు ఖేరు, బి. జి. ఖేర్, విశ్వనాథదాసుగారలు తమరాష్ట్రములలో కాంగ్రెసువారు పదవీ స్వీకరణమునకు అనుకూలముగ నున్నట్లుఅభిప్రాయములను తెలిపిరి. వారివారి రాష్ట్రములలోగల పరిస్థితులనుగురించి తెలిపి తమ అభిప్రాయములకు గల కారణములను విపులముగ వివరించిరి. తరువాత 7 తేది మధ్యాహ్నం 3 గంటలకు యీ పార్టీ నాయకులు తిరిగి వర్కింగుకమిటీని కలుసుకొనవలెనని కోరబడిరి. పత్రికావిలేఖరులు ఏమి జరిగినది కనుగొన ఎంతప్రయత్నించినను ఏ నాయకుడును, ఏసమాచారమును బయటపెట్టలేదు.

రాష్ట్రీయ అసెంబ్లీ కాంగ్రెసుపార్టీ నాయకులు 7 తేది మధ్యాహ్నం 3 గంటలకు మరల కమిటీవారిని కలుసుకొనిరి.

## పదవీ స్వీకార మామోదింపబడుట

పదవీస్వీకరణము గురించి గావించబడిన ప్రత్యేకప్రకటనలు తృప్తికరముగ లేకపోయినను ప్రస్తుతప్రజాభిప్రాయమును గుర్తించి కాంగ్రెసువారు పదవులను స్వీకరించవలెనని కమిటీవారు నిర్ణ[illegible]

కొరవ 7-వ పేజి 4-వ కాలంచూడుడు.

## కొన్ని మచ్చుతునకలు.

—:○:—

"అయితే యిప్పటి రైతు ఉద్యమములో స్త్రీలకు సంబంధించిన భాగము మాత్రము ఒక్కటిగా ఉన్నది. దానినిగూర్చి గృహలక్ష్మియు గృహిణులును జాగ్రత్తగా యోచించాలి. సకాలములో యీవిషయమై ఆలోచించకపోతే ముఖ్యముగా మన వనితాలోకమునకు చాలా యిక్కట్టులు సంభవిస్తాయి.

అదియేమంటే, ముందు మన భారతరాజ్యములో స్త్రీకి భూమి సంబంధమైన హక్కులు యెట్టివై యుండవలెను!

ఇది చాల ముఖ్యప్రశ్న. ఎందుచేతననగా యిప్పటి భారతదేశములో ముఖ్యముగ మన హైందవస్త్రీలకు ఆస్తిహక్కులు చాల స్వల్పముగ నున్నవని అందరు తెలుసుకున్నారు. ఉన్న స్వల్పము ఆధరణాదిచరాస్తిగనుండును. కొద్దిభాగము మాత్రము యిండ్లు భూములు రూపముగనుండును. ఇటీవల కాంగ్రెస్ సభలలో నిరూపింపబడే "భూమి దున్నుకొనే రైతుకు, రాజుకు మధ్య దలారీలుండరా" దనే సూత్రము స్త్రీలకుండకున్న యీకొద్దిపాటి హక్కులకును యెట్టి భంగము కలిగించును! స్త్రీలు స్వయముగ భూమి దున్నుకొనజాలరు గదా! అట్టి సందర్భమున స్త్రీలకు యిప్పుడుగల భూమి హక్కుల గతి యేమికావలెను! ముందు ముందు స్త్రీలు తమ స్త్రీధనమును భూమిరూపముగ సంపాదించుకొనవలెనా! అక్కరలేదా! అనేప్రశ్నలు సహజముగ నుదయించును.

ఈప్రశ్నలకు ముఖ్యకారకులయిన మనకాంగ్రెస్‌మిత్రులు యీవిషయమై తగుసమాధానమిచ్చి నారీలోకమును తృప్తిపరచుట వారి విధి, సర్వసాధారణముగను, అందు ముఖ్యముగ తమ కరాచీ ప్రాథమికహక్కు సూత్రమందును స్త్రీల క్షేమమునకు మన కాంగ్రెస్ మిత్రులు సుముఖులగుటచే యీ విషయము సకాలమున, సక్రమముగ యోచించి, స్త్రీలలో అనవసరమగు ఆందోళనకును, అలజడికిని తావీయకుందురు గాక యని కోరుచున్నాము.

—గృహలక్ష్మి.

* * *

"మననాయకులకు తలకొకవ్యాపారం తగిలియున్నది. రామదాసుపంతులుగారికి సహకారోద్యమం, పట్టాభిసీతారామయ్యగారికి యిన్సూరెన్సు యుద్యమం, గిరిగారికి కార్మికోద్యమం, రంగాగారికి కర్షకోద్యమం, సాంబమూర్తిగారికి శిష్యులను, శిష్యురాండ్రను అభ్యుద్ధరించు యుద్యమం- ఇకరా ష్ట్రోద్యమం మాట తలపెట్టు వారెవరు"

—ఆంధ్రభూమి.

---

### ఉదయగిరి విద్యాసంఘము.

ఈ సంవత్సరము యీతాలూకా మహాసభ జరుగవిషయమై తాలూకాలోని ఉపాధ్యాయులు ఆలోచించి నిర్ణయించుమరని కోరుచున్నాను—

వేదగిరి సుబ్బరాయుడు,
ట్రెజరరు వింజమూరు.

---

## రైతు రక్షణ యాత్ర

ఇచ్ఛాపురం నుండి చెన్నపట్టణం.

800 మైళ్లు కాలినడక సంచారము
3 మాసాలు

మదరాసు ప్రభుత్వభవనానికి
రైతుల రాయబారం.

1. ఎస్టేటు లాండులాక్టు 2. ఋణపరిష్కారచట్టము. 3. ఫారెస్టుయాక్టు 4. భూమిశిస్తు విధానచట్టములకు సవరణలు సూచింపుచు ఆంధ్రరాష్ట్రరైతుసంఘము వారామోదించిన రైతుల నూతన కనీసకోరికల ప్రణాళికలు ప్రజాసంగ్రామము బడయుటకు, ప్రభుత్వమువారిచేత, శాసనసభికుల చేత ఆమోదింపజేయుటకు, యీయాత్ర ఉద్దేశింపబడినది, గాన ఉ॥ వి॥ జిల్లా రైతు సంఘము వారు యిందు ప్రకటించిన కార్యక్రమను ప్రకారము, ఆయాప్రాంతాలలో జరుగుసభలకు వేలకొలది రైతులు హాజరై, తమతమ కష్టనిష్ఠూరాలు, అవసరాలు ప్రకటించుకొని, వందలకొలదిగా ప్రతినిధులు రైతురక్షణయాత్రలో పాల్గొని కర్తవ్యానికి గడంగవలసినదిగా కోరుచున్నాము. ఏమైన ప్రత్యేక క్లిష్టసమస్యలున్న వెంటనే ముందుగా, శ్రీకాకుళంలోనున్న జిల్లారైతు సంఘ కార్యాలయానికి యీనెల ఆఖరులోగా తెలియజేయ ప్రార్థన. జిల్లాలలోనున్న రైతుసేవకులు, నాయకులు అభిమానులెల్లరు సంచారమునందు పాల్గొని ఆంధ్రరాష్ట్ర రైతురక్షణయాత్ర దిగ్విజయముగా నిర్వహింప గోరుచున్నాము.

సంచార కార్యక్రమము
10 వ తేదీ శనివారం

వెదుళ్లవలస, తిలసముద్రం మీదుగా మబగాంలో మధ్యాహ్నం 12 గంటలకుబహిరంగసభ. సాయంకాలం 5 గంటలకు సింగుపురంలో సభ. శ్రీకాకుళంలో రాత్రి విశ్రాంతి.

ఈ సంచారమందు రైతులెల్లరు రైతుసంఘ సభ్యులుగాచేరి సంఘనిర్మాణమునకు తోడ్పడవలెననియు, రైతోద్యమాభివృద్ధికిగాను "రైతునిధి"కి శక్తికొలది కానుకలు సమర్పించవలసినదనియు ప్రార్థించుచున్నాను.

పుల్లెల శ్యామసుందరరావు
ఎమ్, ఎల్. ఏ. అధ్యక్షులు
దుక్కా సూర్యనారాయణరెడ్డి,
గౌతు లచ్చన్న,
కార్యదర్శులు.

* * *

దక్షిణ విశాఖపట్టణజిల్లా రైతుసంఘయాజమాన్యమున 6-7-37 తేదిని బొబ్బిలితాలూకా పిరిడిగ్రాంరైతుదండు బయలుదేరిరామభద్రపురం, సాలూరు గ్రామాలమీదుగా తే 10-7-37 దిన శ్రీకాకుళంలో ఆంధ్రరైతుదండును కలసికొని కొంతవరకు వారితోటే యాత్రసాగింతురు. మండలరైతుసోదరులెల్లరు యీయాత్రలో పాల్గొన ప్రార్థన.

యస్. నరసింహమూర్తి
ప్ర॥ కార్యదర్శి
దక్షిణ విశాఖ జి॥ రై॥ సం॥

---

## జమీందారును రైతులుచంపుట

మహాపూరు జమీందారీలో ఒక రైతు సకాలములో శిస్తులు చెల్లించనందున అతనిని రెవిన్యూఅధికారులకు జమీందారు స్వాధీనపరచెను. ఆరైతు కాపలాలోనుండి తప్పించుకొని అతనిని కత్తితోపొడిచి చంపెను. ఈసందర్భమున ఒకపోలీసు ఆరైతు అరెస్టుచేయబడియున్నారు.

---


సంగీత పాఠకులు
డ్రామా యాక్టర్లు సేవింపదగిన
### గంధర్వ కిన్నర స్వరామృతం.

గానకళ పరివృద్ధికి తెచ్చుటయందీ మందు అమృతతుల్యం, అనితర కల్పతరువు. మృదుమధుర స్వరగాత్రసంధాయిని బొంగురుగొంతుక కలవారి పాలిటి కల్పమై ఆశ్చర్యకరమగు కోకిలస్వరమును కూర్చుటయందు దీనికిదియేసాటి. వేయేల ఇదివాడిచూచి ధన్యులుగండు. గుణము లేదని ఋజువుపరచిన డబ్బు వాపసు చేయబడును. 15 దినములకు సరిపడు డబ్బా 1-కి రు 2—0—0.

(పోస్టేజి ప్రత్యేకం)
శ్రీవాణి అండ్ కో, అల్లీపురం,
వాల్టేరు ఆర్. యస్.


---

## నెల్లూరు సబ్‌జడ్జి కోర్టులో

I. A. No. 49 1937
I. P. No 17 of 1932.

గొల్ల కొండయ్య ... పిటిషనరు.

ఎదిరీలు.

(1) తాతా వెంకటాద్రి వగైరాలు-రెస్పాండెంట్లు
10 రెస్పాండెంటు:- కావలి పెదయాళ్వారు శెట్టి భార్య లక్ష్మిదేవమ్మ.

ఈనెంబరు పిటిషనరు తనకు డిస్‌ఛార్జి వుత్తర్వును యిప్పించవలెనని కోరుతూ 23-2-37 తేదిన యీ నెంబరున పిటిషన్ దాఖలుచేసి వున్నాడు. సదరు పిటిషన్ 10 వ రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం తే 12-7-37 దికి వాయిదా వేయబడివున్నది. ఆక్షేపణవున్నయెడల వాయిదానాడు 10 గంటలకు పై కోర్టువారి యెదుట హాజరయి తెలుపుకొనవలెను. లేనియెడల ఆపెటిషనుమందు విచారించి తీర్మానించబడునని యిందువల్ల తెలుపడమైనది.

టి. వి. జగన్నాథం,
పిటిషనరు ప్లీడరు.

---


## "తెలుగులా" బుక్కులు.

| | |
|---|---|
| ఎస్టేటులాండు ఆక్టు (యినాములఆక్టు) దావాలు, పిటిషనులు, కాలము, తెలుగు ఫెడ్యూళ్లు చేర్చి- | 1-4-0 |
| ఋణపరిష్కార చట్టము కొత్తఆక్టు | 0-5-0 |
| మోటారుబండ్ల చట్టము | 0-6-0 |
| గ్రామకోర్టుల చట్టము 1937 వరకు సవరణలు సివిల్ క్రిమినల్ చేర్చి- | 0-8-0 |
| రిజిస్ట్రేషన్ ఆక్టు | 0-12-0 |
| హిందూలా సారాంశము- | 0-8-0 |
| ఆస్తిట్రాన్సుఫర్ చట్టము- | 0-8-0 |
| ఫ్యాక్టరీ ఆక్టు | 1-0-0 |
| సివిల్ ప్రొసీజరుకోడ్డు (1937 సం॥ సవరణ ఫీజులతో 600 లు- | 3-8-0 |

తెలుగులా రిపోర్టులు ప్రతినెల 1,15, తేదులయందు బుక్కులుగా వెలువడును. అన్నిహైకోర్టుల ప్రివికౌన్సిలు తీర్పులు, క్రొత్తఆక్టులు జి. ఓ. లు ప్రకటింపబడుచుండును.

సంవత్సరచందా 8-0-0

మేనేజరు,
తెలుగులా జర్నలు ఆఫీసు, నెల్లూరు.


---


అక్షరాక్షరానికి అర్థముగల "పంచాక్షరి"

# జీవామృతము

జీవితోత్సాహము కలుగచేయును
వాజీకరణము
మృత్యువును దూరముచేయును
తనువునకు దార్ఢ్యమునిచ్చును
ముదమును కలిగించును

మధురమయ జీవనానికి అమృతమయమగు ఆరోగ్యానికి

జీవామృతము

ఆయుర్వేదాశ్రమం : మదరాసు

స్టాకిస్టులు:- వి. సుబ్బారావు అండ్ సన్స్ కెమిస్ట్సు, ట్రంకురోడ్డు, నెల్లూరు.

# జమీన్ రైతు

## నెల్లూరు మునిసిపల్ ముచ్చట్లు.

అధికారాన్ని ఎవరువచ్చినా, వచ్చినవారికి తన అధికారాన్ని శాశ్వతంగా వుండాలనే ఆలోచనలో పరిపాలన జరగాలని ఉద్దేశమే కాని పురోభివృద్ధి, పౌరుల సౌకర్యాభివృద్ధిని మనస్సులో పెట్టుకొని ప్రవర్తించడంలేదు. అధికారులు అధికమౌతున్నారేగాని పరిపాలనా సౌష్ఠవం, ప్రజలకు సౌకర్యాలు, పురోపాలకత్వం నానాటికి సన్నగిలి పోతున్నాయి.

### ప్రాథమిక విద్య.

ప్రాథమిక విద్యను మునిసిపాలిటీలో ఉచితంగా ప్రవేశపెట్టామని మునిసిపాలిటీ గర్విస్తుంది. కాని యీ మునిసిపల్ పాఠశాలలమీద ప్రజలకు ఆకేమి ఖర్మమోగాని అభిమానం తగ్గిపోతున్నది. దబ్బిచ్చయినా గ్రాంటు స్కూళ్లకు పంపిస్తున్నారుగాని వుచితంగా చెప్పే మునిసిపల్ పాఠశాలలకు పంపుటలేదు. అసలు మునిసిపల్ కవున్సిలర్లే తమ బిడ్డలను మునిసిపల్ బళ్లకు పంపనప్పుడు యితరులు పంపకుండా వుండడంలో ఆశ్చర్యంలేదు. యెయిడెడ్ స్కూళ్లకు, మునిసిపల్ స్కూళ్లకు పోటాపోటీ యేర్పడి మునిసిపల్ స్కూళ్లు ప్రజాభిమానాన్ని సంపాదించుకోలేక పడిపోతున్నాయి. దీన్నిగురించి గత మూడేండ్లలో ఛైర్మనులుగాని, కవున్సిలు అధికారులుగాని చేసిన అభివృద్ధి యేమీ కన్పడడంలేదు.

### డస్టు బిన్నులు.

రెండులక్షలకుపైగా ఆదాయంగల యీమునిసిపాలిటీలో సరియైన డస్టు బిన్నులకు గతిలేక తొట్టిదబ్బాలు పెట్టారంటే మునిసిపాలిటీకి ఎంత గౌరవమో కౌన్సిలువారే యోచించాలి. ఈ తొట్టిదబ్బాలుకూడా మంచివిలేవు. కొన్నిచోట్ల అరడుగుకు పైగా కంతలు. వీధిప్రక్కన కంతలు వుంటే అవమానమని గోడప్రక్కకు తిప్పిపోతారు కనపడకుండా వుండడానికి.

### టాక్సు డిపార్టుమెంటు.

మునుపు ఒక టాక్సుసూపరింటు వుండేది. ఇప్పుడు అధనంగా రెండో టాక్సు సూపరింటు డిప్టెయినట్లు బలగం జాస్తిఅయింది. కాని వీరు వచ్చినందువల్ల మునిసిపాలిటీకి యేమైనా లాభం సౌకర్యం కలిగిందా అని అంటే అదిశూన్యం. వసూలా యథాప్రకారంగానే వుంది. ఎందుకీ అనవసర అధిక ఖర్చు—? ఈ రెండో టాక్సుసూపరెంటు, డిప్యుటీకర్గ [illegible] బిల్లుకలెక్టరు నెలకింత వసూలు చూపాలని కఠినంగా వుత్తర్వులు చేస్తే పనిజరుక్కపోయిందా?

### కల్తీ నెయ్యి.

ఇతరగ్రామాలనుండి వచ్చే కల్తీనెయి కొంతవరకు నివారింపబడిందేగాని బజారులో కల్తీనెయి తప్ప మంచిది దొరకడంలేదు! ఎక్కడనుంచి [illegible]? దీన్ని అరికడానికి [illegible] మునిసిపాలిటీ శక్తి సామర్థ్యాలు లేకుండావున్నవి. సశేష.

—పౌరుడు.

## సాక్షేపాళెం బోగస్ ఎయిడెడ్ స్కూలు.

నెల్లూరుకు మూడుమైళ్ల దూరంలోవుండే సాక్షేపాళెం గ్రామ మాలవాడలో ఒక ఎయిడెడ్ పాఠశాలవుంది. ఈ పాఠశాల అయ్యవారు తనకు తీరినప్పుడు ఏవారానికో ఏపదిరోజులకో నెల్లూరునుండి ఒకసారివచ్చి బడిరిజిష్టరులు తీసి బల్లోదుమ్ము దుమారం శుభ్రంచేసి రాత్రికి మళ్లీ నెల్లూరుకు యింటికిచేరుకునే అలవాటు. పిల్లకాయలకేమో అక్షరం ముక్కా. దిక్కూ మొక్కూ తెలియని ఆమాలవాడ వారలు ఏం చేస్తారుపాపం!

వారంరోజులనాడు జూనియర్ డిప్టీయిన్స్పెక్టరు ఆబడితనిఖీకి పోయినాడట. సర్ప్రయిజు విజిటుగామాల పాపం అయ్యవారికి తెలియలేదు యిన్స్పెక్టరు పోతాడని. మమూలుగానే బడికి నాగాపెట్టాడు. బడి తెరవవలసిన తేదీ వారం క్రింద గడచిపోయినా యీ దొరకుమాత్రం ఆబడి సమాచారం జ్ఞాపకానికిరాలేదు. కౌన్సిలువారికి తీరినప్పుడు వారిష్టప్రకారం గ్రాంటులు యిచ్చేటప్పుడు తానుమటుకు రూల్సుప్రకారం చేయకపోతే ఒక తప్పుక్రిందికి చేరదనుకున్నాడుగామాల యీ అయ్యవారు. యిన్స్పెక్టరుగారు వూళ్లో వాళ్ల స్టేటుమెంటులు తీసుకొనివచ్చాడట. ఇన్స్పెక్టరు పోయివచ్చిన తర్వాతనైనా యీ అయ్యవారు బడి తెరిచాడో లేదో? ఇటువంటి పాఠశాలలకు రైతు చమటతీసి ప్రభుత్వానికి చెల్లించిన పన్నులు వినియోగం అవుతున్నాయి యీ అబందరకౌన్సిళ్ల చేతుల్లో.

ఈలావున్నాయి నెల్లూరు ఎడ్యుకేషన్ కౌన్సిలువారి పరిపాలనక్రిందవుండే గ్రాంటు పాఠశాలలు. నెల్లూరుకు మూడుమైళ్ల దూరంలోనే యింతమోసం జరుగుచుంటే, యింక ఆ కందుకూరు, కనిగిరి, పొదిలి, దర్శి బళ్లమాట ఏ విధంగావుంటుందో పాఠకులే వూహించుకోవచ్చు.

—సారధి

## వెంకటగిరి కాంగ్రెసు ఎన్నికలు.

వెంకటగిరిటవున్ కాంగ్రెసు కార్యనిర్వాహకపు ఎన్నికలు యీనెల 12వ తేది సోమవారం సాయంత్రం 6 గంటలకు వెంకటగిరి స్వరాజ్య మైదానముదగ్గర కాంగ్రెసు ఆఫీసులో జరుగును. కాంగ్రెసు సభ్యులెల్లరు విచ్చేసి పాల్గొనగోరుచున్నాను.

కె. నారాయణరావు,
జిల్లా కాంగ్రెసు కార్యదర్శి.

## యూరోపియన్ ప్రయాణీకుల దౌర్జన్యము

మధ్యపరగణాలలో ఒకస్టేషనులో హెచ్. వి. కామత్ ఐ. సి. యస్. గారు ఫస్టుక్లాసు టిక్కెట్టు కొనుక్కొని ఫస్టుక్లాసులో యెక్కబోయినారు. ఆకంపార్టుమెంటులో వుండిన యిద్దరు యూరోపియన్ ప్రయాణీకులు బండి యంతా తామే రిజర్వు చేసుకున్నామని చెప్పి కామత్ గారిని లోపలికి రానీయలేదు. ఆకంపార్టుమెంటును రిజర్వుచేసుకోవాలంటే వీరు మొత్తంమీద నాలుగుటిక్కెట్లు కొనివుండవలెను. కాని వీరు రెండోటిక్కెట్టును హౌరానుండి బొంబాయి వరకు కొని వుండిరి. కామత్ గారు ఫస్టుక్లాసు టిక్కెట్టు కొనివుండికూడా సెకండుక్లాసులో ప్రయాణం చేయవలసివచ్చింది.

జి. ఐ. పి. రైల్వేవారు వీరిద్దరివద్దనుండి యింకెవ్వరిని యెక్కనివ్వ నిరాకరించినందులకు యెక్సెస్ ఛార్జీవసూలుచేయ నిశ్చయించినారు. కంపార్టుమెంటును తాము రిజర్వుచేసుకోకుండానే రిజర్వు చేసుకున్నటుల ప్రవర్తించినందులకు చట్టప్రకారం అవసరచర్యగైకొన తలంచిరి. విచారించగా వారిద్దరిలో ఒకరు కలకత్తాలోను, మరొకరు ఇంగ్లండులోను వున్నటుల తేలెను. ఇంగ్లండులో వుండే అతను విచారణకొరకు ఇండియాకు రావలసి యున్నది.


## నెల్లూరు పర్మెనెంటు ఫండు, లిమిటెడ్.

యీఫండులో ఒక సంవత్సరము పర్మెనెంటు డిపాజిట్లు రు. 100/-లకు సంవత్సరం 1 కి రు. 4—0—0 లు వడ్డీ యిచ్చేషరతుపైన తీసుకొనెదరు. యితర వివరములు ఫండు ఆఫీసులో ఆఫీసువేళలలో తెలుసుకొనవచ్చును.

బి. ఆదిశేషయ్య,
సెక్రటరి.





## DENTAL HOSPITAL

Trunk Road, Nellore.

## దంత చికిత్సాలయము

ట్రంకురోడ్డు, నెల్లూరు.

పండ్లు మానవసౌందర్యమునకు ముఖ్యమైనవి. కానశుభ్రముగా నుంచుకొనుడు! పండ్లను పరీక్షించుటకును, శుభ్రపరచుటకును, కొత్త పండ్లుకట్టుటకును, అన్నివిధములైన పళ్లనొప్పులను కుదుర్చుటకును ప్రఖ్యాతిచెందినవారు.

సలహాయిచ్చు కాలము:— ఉదయం 7-30 నుండి సా॥ 5-30 వరకు

డాక్టర్ ఎ. తంబూ, పండ్లవైద్యులు.



## స్టౌ బీడీ




ఒకసారి పీల్చి పొగాకువందలి సువాసన గమనింపుడు.



Printer, Publisher and Editor—N. V. Rama Naidu, Zamin Ryot Press, Gandhi Chouk, Nellore.